క్లుప్తంగా

ఎమ్మెల్యేకు సన్మానం



కావలి రూరల్ : ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పందిటి కామరాజు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించి తనకు పదవి రావడానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఆయన బాటలోనే కావలి నియోజకవర్గంలోని అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేకూర్చేలా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించేందుకు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు.

శ్రమదానం



చేజర్ల: ఆదూరుపల్లిలోని ముస్లిం శ్మశాన వాటికను మతపెద్ద మౌలానా మహబూబ్ ఆధ్వర్యంలో ఆదివారం శుభ్రం చేశారు. ఇటీవల శ్మశానంలో పిచ్చి మొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారడంతో ఉదయం నమాజు తర్వాత ముస్లిం యువకులు శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు.

పోలేరమ్మకు పొంగళ్లు



జలదంకి: మండలంలోని జలదంకి, చామదల గ్రామాల్లో పోలేరమ్మకు ఆదివారం భక్తులు పొంగళ్లు పెట్టారు. తొలుత పోలేరమ్మను పసుపు, కుంకుమతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

వాహనాల తనిఖీ



కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలో ఎస్సై ఎం సూర్యప్రకాష్‌రెడ్డి ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహన, డ్రైవింగ్ లైసెన్సులు లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు అన్ని ధ్రువీకరణపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్ బాలలకు వాహనాలు నడపరాదన్నారు. కలిగిరిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా వాహనాలను రోడ్లపై నిలిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అచ్చమాంబకు పొంగళ్లు

మర్రిపాడు: పొంగూరు మాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాలు ఆలయం వద్ద ఆదివారం భక్తులు పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఉదయం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి భజనలు నిర్వహించారు.

28లోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

వరికుంటపాడు: మండలంలో పంటలు సాగుచేసిన రైతులు ఈ నెల 28వ తేదీలోగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని మండల ఏఓ జీ కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ-క్రాప్, ఈకేవైసీ చేయించకోకపోతే ఇన్‌పుట్ సబ్సిడీ, పీఎం కిసాన్, రైతు భరోసా, వైఎస్సార్ సున్నా వడ్డీ, తదితర ప్రభుత్వ పథకాలు వర్తించవని తెలిపారు.

క్విజ్ పోటీలు



కావలి రూరల్: పట్టణంలోని రెడ్‌క్రాస్ భవనంలో సేవియర్స్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు ఆదివారం క్విజ్ పోటీలు నిర్వహించారు. కావలి డీఎస్పీ వెంకటరమణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నవయస్సులోనే సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఆదర్శంగా నిలుస్తున్న సేవియర్స్ సభ్యులను అభినందించారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు క్విజ్ పోటీలను నిర్వహించడం సంతోషకరమన్నారు. భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హిందీ పండిట్ కళ్యాణి, సేవియర్స్ సభ్యులు మాధురి, కీర్తి, దీపిక, నవ్య,జాహ్నవి, స్వాతి, బిల్వని, హర్ష, వినీల్, రమణ్, శ్రీను, కౌషిక్, భార్గవ్, నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మెట్టభూముల్లో పంటల సిరి

గత కొన్నేళ్లుగా వర్షాలు లేక..సాగునీరందక బీళ్లుగా మారిన మెట్టభూములు పంటలతో కళకళలాడుతున్నాయి. గత మూడేళ్లుగా వర్షాలు విస్తారంగా పడుతుండడం..చెరువులకు ఉత్తర కాలువ ద్వారా సోమశిల జలాలు పుష్కలంగా చేరుతుండడంతో మెట్టభూములు సాగులోకి వచ్చాయి. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో రైతులు పంటలను విస్తారంగా సాగుచేస్తుండడంతో సాగువిస్తీర్ణం రెట్టింపు అయింది.



అనుమసముద్రం చెరువు కింద సాగు చేసిన వరిపంట

అనుమసముద్రంపేట: గతంలో వర్షాలు పడక మండలంలోని రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. మెట్ట భూముల్లో పంటలు పండకపోవడంతో పశువులపై ఆధారపడి పూట గడుపుకొనేవారు. పశువులకు సైతం మేత దొరక్క డెల్టా ప్రాంతాలకు వెళ్లి అత్యధిక రేట్లకు గడ్డిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఉండేది. పదెకరాలకుపైగా భూమి కలిగిన రైతులు కూడా పంటలు పండించుకోలేని దుస్థితిలో ఉండేవారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి మారింది. గత మూడేళ్లుగా వర్షాలు పుష్కలంగా పడుతూ చెరువుల్లోకి సాగునీరు చేరుతుండడంతో రైతుల్లో ఆనందం మొదలైంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో భాగంగా సోమశిల ఉత్తరకాలువను కోట్లాది రూపాయలు వెచ్చించి ఆధునీకరించారు. దీంతో సోమశిల నుంచి రాళ్లపాడు ప్రాజెక్ట్ వరకు ఉత్తరకాలువ ద్వారా సాగుజలాలు సాఫీగా సాగుతున్నాయి. మెట్టప్రాంతమైన ఏఎస్‌పేట మండలంలోని అన్ని చెరువులకు సాగునీరందిస్తే రైతులు సంతోషంగా ఉంటారని గ్రహించిన దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లారు. నీటిపారుదల శాఖ అధికారుల ద్వారా మండలంలోని 33 చెరువులకు సాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేయించారు. దీనికితోడు గత మూడేళ్ల నుంచి పుష్కలంగా వర్షాలు కురుస్తుండడంతో సాగుకు ఢోకా లేకుండాపోయింది. గత ప్రభుత్వ హయాంలో మూడు వేల ఎకరాలకు మించి సాగని సేద్యం నేడు 15వేల ఎకరాలకు చేరుకుంది. ఈ ఏడాది 12 వేల ఎకరాల్లో వరి సాగుచేపట్టగా, 3 వేల ఎకరాల్లో మినుము, పెసర, శనగ, పత్తి, కూరగాయ పంటలను సాగుచేస్తున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహంతో..

ప్రభుత్వం ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి రైతులకు సాగులో అండగా నిలుస్తోంది. రైతుభరోసా పథకం కింద పంటల సాగుకు పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. ఆర్‌బీకేల ద్వారా సబ్సిడీపై ఎరువులు, విత్తనాలను ఇంటి ముంగిటకే అందజేస్తోంది. ప్రకృతి విపత్తులతో నష్టపోయిన రైతులను పంటల బీమా ద్వారా ఆదుకుంటోంది. దీంతో రైతులు విస్తారంగా పంటల సాగుచేపడుతున్నారు.

రైతుకు ఢోకా లేదు



గతేడాది రాజవోలు చెరువు కింద పదెకరాల్లో పంటలు సాగు చేపట్టా. ఈ ఏడాది చెరువులో పుష్కలంగా సాగునీరు ఉండడంతో 12 ఎకరాల్లో సాగు చేపట్టా. ప్రభుత్వం తోడ్పాటుతో ఈ ఏడాది రెండో పంట కూడా సాగు చేపడుతాం.

– జీ శ్రీనివాసులు, రైతు, రాజవోలు

సాగు విస్తీర్ణం పెరిగింది



ఈ ఏడాది వర్షాలు బాగా పడడంతో పాటు ఉత్తర కాలువ ద్వారా సాగునీరు రావడంతో అనుమసముద్రం చెరువు పూర్తిస్థాయిలో నిండింది. దీంతో చెరువు కింద సాగు విస్తీర్ణం పెరిగింది. ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను సరఫరా చేస్తుండడంతో పట్టణాలకు వెళ్లే శ్రమతగ్గింది. దీంతో ఈ ఏడాది పదెకరాల్లో సాగుచేపట్టా. పంట ఆశాజనకం ఉంది. ధాన్యం ధరలు బాగున్నాయి. మంచి లాభాలు వస్తాయని ఆశిస్తున్నాం.

– సుంకర రవీంద్రారెడ్డి, రైతు, అనుమసముద్రం

మెట్ట పంటల విస్తీర్ణం కూడా పెరిగింది

భూమిలో తేమ ఉండడంతో రైతులు వరితో పాటు పెసర, మినుము, శనగ, పత్తి, తదితర మెట్ట పంటలను విస్తారంగా సాగుచేశారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడులకు నగదు సాయం అందిస్తుండడం..ఆర్‌బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందజేస్తుండడంతో మెట్ట భూముల్లోనూ పంటలను పండిస్తున్నారు. వరి కోతలు ప్రారంభం కానుండడంతో ఆర్‌బీకేల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం.

– రజనీ, వ్యవసాయశాఖ అధికారిణి

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు



జలదంకిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఉదయగిరి: తూర్పురాయలసీమ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎల్‌సీ రమణారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఏపీటీఎఫ్, బీటీఏ నాయకులు ఎండీ ఖాజా, జ్యోతి శ్రీనివాసులు ఉదయగిరిలో ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఏపీటీఎఫ్, బీటీఏ, సీపీఎస్ సంఘాలతో పాటు మరో 26 ఉపాధ్యాయసంఘాల మద్దతుతో పోటీ చేస్తున్న రమణారెడ్డిని గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయ నాయకులు రామకృష్ణ, ఓబుల్‌రెడ్డి, షబ్బీర్, మాధవరాజు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జలదంకి: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు జలదంకిలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. తూర్పురాయలసీమ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కుట్టుబోయిన బ్రహ్మానందాన్ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు మార్లెళ్ల బ్రహ్మారెడ్డి, నాయకులు చల్లా హనుమారెడ్డి, వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, కంచర్ల శరత్‌కుమార్, బండారు తిరుపతిరెడ్డి, రాకేష్‌రెడ్డి, మధు, వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి స్పందన

అల్లూరు: స్థానిక దేవిరెడ్డి శారదా చారిటబుల్ ట్రస్ట్‌లో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దేవిరెడ్డి శారదమ్మ ఆరో వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 75 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలను వివరించారు. నెల్లూరుకు చెందిన నమో హోమియో క్లినిక్ వైద్యుడు మహేంద్ర ఆధ్వర్యంలో హోమియో వైద్యశిబిరాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ప్రతి నెలా చివరి ఆదివారం ఉచితంగా హోమియో వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ట్రస్ట్ సిబ్బందికి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ట్రస్ట్ మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ట్రస్టీ దశరథరామిరెడ్డి

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ఉదయగిరి: పట్టణంలోని ఆల్‌ఖైర్ ఫంక్షన్‌హాల్‌లో పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1993–1994 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఒకరినొకరు కలుసుకుని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. అనంతరం విద్యార్థులు, గురువులు సహపంక్తి భోజనాలు చేశారు.



గురువును సత్కరిస్తున్న పూర్వవిద్యార్థులు

ప్రతిభా పరీక్షలతో ఆత్మస్థైర్యం పెంపు

వింజమూరు: ప్రతిభా పరీక్షలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయని విశ్రాంత డీఎంహెచ్‌ఓ మాసిలామణి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో వింజమూరులో నిర్వహించిన మెగా టాలెంట్ టెస్ట్ విజేతలకు ఆదివారం బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాసిలామణి మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం టాలెంట్ టెస్ట్‌లో 98 మార్కులతో విజేతగా నిలిచిన వింజమూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీతులసి శ్రీరెడ్డికి మాసిలామణి రూ.10వేలు నగదు బహుమతి అందజేశారు. 95 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన జలదంకి జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని లక్ష్మీశ్రీనందినికి ఎస్ తిరుమలరావు రూ.8వేలు నగదు బహుమతి అందజేశారు. 93 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచిన వింజమూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి గుణసాత్విక్‌కు డాక్టర్ షఫీబాషా రూ.6వేలు నగదు బహుమతి అందజేశారు. ఆపస్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వినియోగదారుల హక్కులను పరిరక్షించుకోవాలి

కావలి రూరల్: సమాజంలోని ప్రతిఒక్కరూ వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు చట్టాలు వచ్చి 20 ఏళ్లు గడిచినా అధికారుల అలసత్వంతో ఇప్పటికీ దగాకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినియోగదారుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేస్తే ప్రభుత్వానికి ఆదాయంతో పాటు వినియోగదారుడికి నాణ్యమైన వస్తువులు అందుతాయని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.

మెగా సైన్స్ గెలాక్సీ ఎక్స్‌ఫో

కావలి రూరల్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఓవెల్ మినర్వా పాఠశాలలో మెగా సైన్స్ గెలాక్సీ ఎక్స్‌ఫో-2023ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. జవహర్‌భారతి డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర శాఖాధిపతి వసుందరదేవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల మేధస్సును పెంపొందించే దిశగా సైన్స్ గెలాక్సీని నిర్వహించడం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ మాట్లాడుతూ ఓవెల్ విద్యా సంస్థల చైర్మన్ రంగిశెట్టి వేణు ఆలోచన మేరకు సైన్స్ గెలాక్సీ ఎక్స్‌పో నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ శివయ్య, సుమలత, డీజీఎం వాహబ్, ఏజీఎం వినోద్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సర్వీసులు నడపాలని విజ్ఞప్తి

వరికుంటపాడు: ఉదయగిరి నుంచి గండిపాళెం వయా పెద్దిరెడ్డిపల్లి మీదుగా పామూరుకు ఆర్టీసీ షటిల్ సర్వీసు నడపాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మార్గంలో సక్రమంగా బస్ సర్వీసులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రైవేట్ వాహనాల్లో అధిక చార్జీలు చెల్లించి మరీ ప్రయాణించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ మార్గంలో తిరిగే స్టూడెంట్ సర్వీసులను ఉదయగిరి–పామూరు మార్గంలో నడపాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ పదాధికారుల సమావేశం

ఆత్మకూరు: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు సూర్యనారాయణరాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆంజనేయులు రెడ్డి కోరారు. పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో బీజేపీ పదాధికారుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, కుట్టుబోయిన బ్రహ్మానందం గెలుపునకు కృషి చేయాలని కోరారు. పార్టీ నాయకులు కే సుధాకర్‌రెడ్డి, భరత్, వాసుపల్లి సుధాకర్‌రెడ్డి, కాటా మహేశ్వర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ జాతర ప్రారంభం



విశేషాలంకరణలో గంగమ్మ



పుట్టమన్ను తెస్తున్న భక్తులు

సంగం: మండల కేంద్రమైన సంగంలో పవిత్ర పినాకినీ నదీ తీరంలో కొలువైన పాలేటి గంగమ్మ జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. తొలిరోజు గంగమ్మకు పినాకినీ నదీ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం పూలతో విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. యాదవ కుల క్షత్రీయులు తప్పెట్లు, తాళాల నడుమ పుట్టమన్ను తీసుకొచ్చి జాతరకు అంకురార్పణ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

వసతిగృహాల్లో తనిఖీలు

ఆత్మకూరు: పట్టణంలోని జేఆర్‌పేట, ఎల్‌ఆర్‌పల్లిలోని బీసీ సంక్షేమ బాలబాలికల వసతిగృహాలను జిల్లా బీసీ సంక్షేమ అధికారి వై వెంకటయ్య ఆదివారం తనిఖీ చేశారు. వసతిగృహాల పరిసరాలు, వంట గదులు, భోజనశాలలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఓ విద్యార్థి చేసిన ఫిర్యాదుపై స్పందించి వసతిగృహ సిబ్బందిని మందలించారు. విద్యార్థులతో ప్రేమగా వ్యవహరించాలని సూచించారు. వసతిగృహాల్లో ఎలాంటి లోటుపాట్లు ఉన్న నేరుగా తనకు ఫిర్యాదులు చేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన వెంట ఏబీసీడబ్ల్యూ సీహెచ్ శ్రీదేవి, వసతి గృహ సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులతో ముచ్చటిస్తున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకటయ్య

భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా ఉండాలి

ఉదయగిరి: మండలంలోని భవన నిర్మాణ కార్మికులు ఐక్యంగా ఉండాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అల్లాడి గోపాల్ పేర్కొన్నారు. స్థానిక షాదీమంజిల్‌లో మండల భవన నిర్మాణ కార్మికుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరి మండల సంఘం నిర్ణయించిన నూతన కూలి రేట్ల ప్రకారం పనులు చేసుకోవాలన్నారు. కొత్త రేట్ల ప్రకారం మేస్త్రికి రూ.100, సహాయకులకు రూ.50 కూలి పెరుగుతుందన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఏమైనా సమస్యలు ఉంటే సంఘం దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షుడు ఎం సుబ్బులు, మండలాధ్యక్షుడు షేక్ ఉస్మాన్‌అలీ, ప్రధానకార్యదర్శి బొజ్జ శ్రీనివాసులు, కోశాధికారి బీమయ్య, తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపు కార్డులను పంపిణీ చేస్తున్న గోపాల్

మసీదు కమిటీలకు నూతన అధ్యక్షుల నియామకం

కావలి : పట్టణంలోని రైల్వేరోడ్డులోని జామియా మసీదు(పెద్ద మసీదు), జెండాచెట్టు సెంటర్‌లోని అహలేసున్నత్ జమాత్(ఉత్తరంపేట) మసీదు కమిటీల నూతన అధ్యక్షులుగా సయ్యద్ అబ్దుల్‌రషీద్, ఎస్‌కే అన్సార్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని నివాసంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని ఆదివారం వారు మర్యాదపూర్వకంగా కలిశారు. మసీదుల నూతన అధ్యక్షులను ఎమ్మెల్యే రామిరెడ్డి శాలువాలతో సత్కరించారు. కావలి నియోజకవర్గంలో ముస్లింలకు అండగా ఉంటామన్నారు. ముస్లిం పెద్దల సూచనల మేరకు మసీదులకు కొత్త కమిటీలను నియమించినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేకు ముస్లిం నాయకులు ధన్యవాదాలు తెలిపారు.



ముస్లిం పెద్దలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తరలింపు

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని వెంకట్రావుపల్లిలోని ప్రభుత్వ భూముల నుంచి గ్రావెల్‌ను కొందరు అక్రమంగా తరలిస్తున్నారు. ప్రైవేట్ భూముల్లో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు తీసుకుని వాటి పక్కనే ఉన్న ప్రభుత్వ భూముల్లో అక్రమంగా తవ్వకాలు చేపట్టి యథేచ్ఛగా గ్రావెల్‌ను తరలిస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రైవేట్ లేఅవుట్లకు గ్రావెల్‌ను తరలిస్తూ లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గ్రావెల్‌ను తరలించే టిప్పర్లతో పొలాల్లోకి వెళ్లే రహదారి గుంతలమయంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆత్మకూరు తహసీల్దార్ లక్ష్మీనరసింహాన్ని సంప్రదించగా తాము ఎవరికీ గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. మైనింగ్ శాఖ ద్వారా అనుమతులు తెచ్చుకున్నా స్థానిక రెవెన్యూ అధికారులకు తప్పనిసరిగా తెలియజేయాల్సి ఉంటుందన్నారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలతో తమకు సంబంధం లేదని మైనింగ్ శాఖ అధికారులు చూసుకుంటారని తెలిపారు.



ప్రొక్లయినర్‌తో గ్రావెల్ తవ్వకాలు సాగిస్తున్న దృశ్యం

వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం రేపు

ఆత్మకూరు: తూర్పురాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు జరిగే సమావేశానికి ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పట్టభద్రులు, తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

వింజమూరు: స్థానిక వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ రేవునూరు శ్రీనివాసులురెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జూపల్లి రాజారావు ఆదివారం తెలిపారు. ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు. వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి మండలాలకు సంబంధించిన పట్టభద్రులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

ఘనంగా ఆరవీడు పాఠశాల వార్షికోత్సవం



ఆత్మకూరురూరల్: మండలంలోని ఆరవీడు ప్రాథమిక పాఠశాలలో వార్షిక వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం పీ కొండారెడ్డి, ఉపాధ్యాయుడు మస్తాన్‌బాషా ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అనంతరం క్రీడా, ప్రతిభా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆరవీడు సర్పంచ్ సూరం ప్రసాద్‌రెడ్డి, ఉపసర్పంచ్ ఖాజావలి, కరటంపాడు జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పెంచలరెడ్డి, వెంకటేశ్వర్లు, ఇమామ్ బాషా, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు మస్తాన్‌రెడ్డి, మాల్యాద్రిరెడ్డి, అంకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.